క్లుప్తంగా

హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ వెల్ఫేర్ కమిటీ ఎన్నిక

మదనపల్లె సిటీ: మదనపల్లెలో సోమవారం హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్స్ పీపుల్స్ వెల్ఫేర్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పూజల జనార్దన్, ఉపాధ్యక్షులుగా అనంత రామచంద్ర, మంత్రి బాబు ఎన్నికయ్యారు. రెండు రాష్ట్రాల చేనేత పరిశ్రమ సంబంధిత వ్యవహారములలో ఉత్పన్నమయ్యే సమస్యలను రెండు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని ప్రధాన కార్యదర్శి జనార్దన్ తెలిపారు.

డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ


మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ డ్రైవర్లు కెఎంపిఎల్ పెంచడానికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సోమవారం మదనపల్లె ఆర్టీసీ–1 డిపో పరిధిలో తక్కువ కెఎంపిఎల్ తెస్తున్న డ్రైవర్లను గుర్తించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డ్రైవింగ్‌లో మెలకువలు గురించి వివరించారు. డ్రైవర్లు డిపో ఆదాయం పెంచడానికి కృషి చేయాలని డీఎం మూరే వెంకటరమణారెడి సూచించారు.

ఆరోగ్య పరీక్షలతో మాతశిశు సంక్షేమం


పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ లక్ష్మీ

పీలేరు రూరల్ : ఆరోగ్య పరీక్షలతో మాతశిశు సంక్షేమం సాధ్యమని డాక్టర్ లక్ష్మీ అన్నారు. సోమవారం తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ కాలంలో తల్లి అనారోగ్యం ప్రభావం, బిడ్డ ఆరోగ్యంపై చెడు ప్రభావం పడకుండా, ఆరోగ్య పరీక్షల ఆవశ్యకతను వివరించారు. చక్కెరవ్యాధి, అధిక రక్తపోటు, బరువు, పెరుగుదల, రక్తహీనత తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన సూచనలతో చేయడంతో పాటు ఐరన్ పోలిక్ యాసిడ్, కాల్సియం మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఏఎస్‌ఎం ఫామున్నీసా, సీహెచ్‌వోలు లావణ్య, కుముదా తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనంపై నుంచి జారిపడి మహిళకు గాయాలు


తీవ్రంగా గాయపడిన శోభారాణి

మదనపల్లె: ద్విచక్రవాహనంపై నుంచి జారిపడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన సోమవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. బి.కొత్తకోటకు చెందిన దంపతులు శోభారాణి(34), గంగాధర ఇద్దరూ కలిసి ద్విచక్రవహనంలో నాయనబావికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గ మధ్యంలోని గట్టుచెరువు కట్టవద్ద ఆమె చీర కొంగు దివ్వచక్ర వాహనం చక్రంలో ఇరుక్కోవడంతో పై నుంచి జారిపడింది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా స్థానికులు బాధితురాలిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సల కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

– నిందితులను గుర్తించడంలో ప్రభుత్వం విఫలం

కలికిరి: పీలేరు నియోజకవర్గ కేంద్రంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను గుర్తించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా కో–ఆర్డినేటర్ తులసీరెడ్డి, పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి విమర్శించారు. సోమవారం కలికిరిలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ విగ్రహం ధ్వంసమై పది రోజులు కావస్తున్నా నిందితులను పట్టుకోకపోవడం దారుణమని, వెంటనే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పీలేరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు ఇసుక అక్రమరవాణా చేసుకుని జేబులు నింపుకుంటున్నారని, గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టరు ఇసుక కలికిరి పట్టణానికి రూ.3వేలుతో అందుతుండేదని, ఇప్పుడు రూ.4వేలుకు చేరుకుందన్నారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గానికి టూరిస్ట్‌గా మారారని, నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలను గాలికి వదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు గడుస్తున్నా నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరుగలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు శ్రీవర్ధన్, సింగం రామక్రిష్టారెడ్డి, మల్లిక, మహబూబ్ బాషా, మంగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల వినతులు
- అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్న సబ్ కలెక్టర్


ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్‌కు సమస్యలు చెప్పుకుంటున్న ప్రజలు

మదనపల్లె : ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని కోరుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని పలువురు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతులు అందజేశారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ సమస్యలపైనే ప్రధానంగా ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి వినతులు స్వీకరించిన సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి సంబంధించి అక్కడికక్కడే ఆదేశాలు జారీచేశారు. తాతల కాలం నుంచి తమ అనుభవంలో ఉన్న 4.15 ఎకరాల భూమిని పత్తేపురంకు చెందిన జి.లక్ష్మీదేవమ్మ, వెంకటరమణలు, రాజకీయ అండతో ఆక్రమించుకుని, వారి పేరుపై అక్రమంగా ఆన్‌లైన్ చేసుకుని 1బీ పొందారని వాల్మీకిపురం మండలం ఓబుళంపల్లెకు చెందిన నీరుగట్టి బాలసుబ్రహ్మణ్యం ఫిర్యాదుచేశారు. ముదివేడు గ్రామ రెవెన్యూదాఖలాలోని రెడ్డివారిపల్లెకు చెందిన వ్యక్తుల నుంచి కొనుగోలుచేసి, రిజిస్టర్ చేసుకున్న భూమిని, ఎలాంటి హక్కులు, అధికారిక పత్రములు లేని రెడ్డివారిపల్లెకు చెందిన తిమ్మారెడ్డిగారి రమణారెడ్డి తనకు భాగము ఉందని చెపుతూ, ఇబ్బందులు సృష్టిస్తున్నాడని, రెవెన్యూ అధికారులతో విచారణ జరిపించాల్సిందిగా మదనపల్లె ఎస్‌బీఐ కాలనీకి చెందిన గంగిరెడ్డి అర్జీ సమర్పించారు. తండ్రి పేరుతో ఆన్‌లైన్‌లో ఉన్న భూమికి తనపేరు మీద 1బీ మంజూరుచేయాలని మూడేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని నిమ్మనపల్లె మండలం అగ్రహారం పంచాయతీ చెరువుముందరవారిపల్లెకు చెందిన ఆర్.రామస్వామిరెడ్డి ఫిర్యాదుచేశారు. సిరికల్చర్ కాలనీలో అనర్హులకు యూనిట్లు కేటాయింపుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, అర్హులకు న్యాయం చేయాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదుచేశారు. విశాఖపట్టణం స్టీల్‌ప్లాంటును ప్రైవేట్‌పరం చేయవద్దని, ప్రభుత్వ ఆధీనంలో నడపాలని మదనపల్లె మండలం సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ అఖిల భారత రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షులు యండపల్లివెంకటరమణ, కోశాధికారి నారాయణలు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే వార్డుబాట

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పట్టణంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే వార్డుబాట నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం పట్టణంలోని 18వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. దేవళంవీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నీటిసరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఇతర సమస్యలపై ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది ప్రజాసమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. పీఅండ్‌టీ కాలనీలో దొంగతనాలు అధికమయ్యాయన్న ఫిర్యాదుపై పోలీసుల గస్తీ పెంచుతామని, కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే తక్షణమే విచారించి చోరీలు జరగకుండా అరికడతామన్నారు. ఇందిరానగర్‌లో నీటిసమస్యపై మున్సిపల్ అధికారులతో మాట్లాడి నీటిసరఫరా మెరుగుపర్చాలని ఆదేశించారు. పెన్షన్‌లు, రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు కావాలని పలువురు ఫిర్యాదు చేశారు. తాగునీరు వారంరోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారని, చెత్త తొలగింపులో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కనపరుస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దున్నపోతు పొడిచి వృద్ధుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె: దున్నపోతు పొడిచి వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. చీకలబైలు పంచాయతీ మేడిపల్లికి చెందిన రామప్ప(65) ఆదివారం రాత్రి ఇంటి ముందు కూర్చుని ఉండగా గ్రామదేవత మొక్కుబడికి వదిలిన దున్నపోతు ఆకస్మాత్తుగా రంకెలు వేస్తూ రామప్పపై దాడి చేసి పొడిచింది. ప్రమాదంలో రామప్ప తీవ్రంగా గాయపడగా కుటుంబసభ్యులు హుటాహుటిన 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

ప్రభుత్వ అసమర్థతతో భారీ నష్టం

- వరద సహాయకచర్యల్లో ప్రభుత్వ వైఫల్యం
- 9 రోజులైనా బాధితులను పట్టించుకోకుంటే ఎలా?
- సాయం అందక బాధితుల ఆర్తనాదాలు
- బాధితుల తరపున పోరాటాలకు వైఎస్సార్ సీపీ సిద్ధం
- నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్



మదనపల్లె : ప్రకృతి విపత్తులను, వైపరీత్యాన్ని అంచనావేయడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమవడం వల్లే విజయవాడలో ఊహించని నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. ప్రభుత్వ అసమర్థతతోనే భారీ నష్టంతో పాటుగా ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ...విజయవాడలో వరద వచ్చి 9 రోజులు గడుస్తున్నా బాధితులకు ఇప్పటికీ సాయం అందకపోవడం బాధాకరమని అన్నారు. బాధితులకు నేటికి సహాయం అందక వారు పెడుతున్న ఆకలికేకలు, నిరాశ, నిస్పృహలతో వారు గడుపుతున్న తీరును సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో చూస్తుంటే కడుపు తరుక్కు పోతోందన్నారు. 30 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల పాలనానుభవం అని పదేపదే చెప్పుకునే ముఖ్యమంత్రి, విజయవాడ మహానగరంలో వరదల్లో చిక్కుకున్న ప్రజలను పూర్తిస్థాయిలో ఆదుకోలేకపోయారంటే ఆయన దక్షత ఏపాటిదో అర్థమవుతోందన్నారు. బాధితులను సహాయక శిబిరాలకు తరలించకపోవడం ప్రభుత్వ వైఫల్యంగా పేర్కొనవచ్చున్నారు. ఆగస్టు 30 నుంచి భారీవర్షాలు వస్తాయని, వరద ముప్పు ఉంటుందని ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇంతటి నష్టం వాటిల్లిందన్నారు. ముందుగానే నీటిపారుదల, రెవెన్యూ, హోంశాఖ కార్యదర్శులతో సమీక్షించి, బాధ్యతలు అప్పగించి, దిశానిర్దేశం చేసి ఉంటే ఇంత ఘోరం జరిగి ఉండేది కాదన్నారు. వరద సహాయక చర్యల్లో ముఖ్యమంత్రి, టీడీపీ నాయకులది ప్రచార ఆర్భాటం, హడావిడి తప్ప బాధితులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన వలంటీర్లను సహాయకచర్యల్లో వినియోగించి ఉంటే.. ప్రజలకు కొంత మేరైనా ముప్పు నుంచి ఉపశమనం కల్పించడంతో పాటు, వారికి అండగా నిలిచేవారన్నారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసం, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ పవర్‌ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదలడం జరిగిందని, దీంతోనే ఇంతటి ఘోరపరిస్థితి తలెత్తిందన్నారు. ప్రభుత్వ సహాయకచర్యలు కేవలం నీళ్లులేని ప్రాంతాల్లో, కొన్నిచోట్ల మాత్రమే అందించి, లోపలి వీధుల్లోని ప్రజలను, కాలనీవాసులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలని కలెక్టర్‌కు వినతి

కేవీపల్లె : అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు, దేవుని మాన్యం భూములను కాపాడాలని కోరుతూ కలెక్టర్ శ్రీధర్ చామకూరికి సోమవారం పీలేరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవీపల్లె మండలంలోని మఠంపల్లె, తీతవగుంటపల్లె గ్రామాల్లో ప్రభుత్వ, దేవుని మాన్యం భూములు అన్యాక్రాంతమైనట్లు తెలిపారు. తిమ్మాపురం గ్రామంలో నిరుపేదల భూములు బడాబాబులు లాక్కున్నారని ఫిర్యాదు చేశారు.

ఉండ్రాళ్లయ్యా..ఉంటామయ్యా

- అంబరాన్నంటిన గణేష్ నిమజ్జన సంబరాలు
- పీలేరు పట్టణంలో భారీ ఊరేగింపు
- సాంస్కృతిక కార్యక్రమాలతో పులకించిన పీలేరు
- పోలీసుల గట్టి బదోబస్తు


పీలేరులో ఊరేగింపు ప్రారంభిస్తున్న నాయకులు

పీలేరు : పీలేరు పట్టణంలో గణేష్ నిమజ్జన సంబరాలు అంబరాన్నంటాయి. చవితి ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల క్రితం ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను సోమవారం రాత్రి అంగరంగవైభంగా నిమజ్జనం చేశారు. పీలేరు పట్టణంలోని అన్ని వినాయక సెంటర్లలో విగ్రహాలను ట్రాక్టర్‌లపై పెట్టి చాందిని, విద్యుద్దీపాలు, పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచే పట్టణంలో ఊరేగింపు కార్యక్రమం మొదలైంది. స్థానిక నెహ్రూబజార్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. విగ్రహాలన్నీ స్థానిక శివాలయం, అక్కడి నుంచి మదనపల్లె మార్గంలోని తిమ్మారెడ్డి క్రాస్ వద్దకు చేరుకుని పోలీస్ సీరియల్ నెంబర్లు తీసుకుని అక్కడి నుంచి ఊరేగింపుగా అయ్యప్పనాయుని చెరువు వద్దకు చేరుకున్నాయి. ఎల్‌బీఎస్ రోడ్డు, అజంతా మిట్ట, పంచాయతీ కార్యాలయం, బస్టాండ్, నాలుగు రోడ్ల కూడలి, యల్లమంద క్రాస్ గుండా అయ్యప్పనాయుని చెరువు వరకు విగ్రహాల భారీ ఊరేగింపు సాగింది. ఊరేగింపు సందర్భంగా ప్రతి బండి వద్ద డీజే సాంగ్స్, బళ్లారి డ్రమ్స్, చక్కభజనలు, కోలాటం, పిల్లనగ్రోవి, మంగళవాయిద్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కర్ణాటక నృత్యాలు, కేరళవాయిద్య బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఊరేగింపు అనంతరం సుమారు వంద విగ్రహాలు స్థానిక అయ్యప్పనాయుని చెరువులో నిమజ్జనం చేశారు. గణేష్ ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పీలేరు పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

బైబై గణేశా

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో సోమవారం గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఎస్‌బీఐ కాలనీ, అమ్మచెరువుమిట్ట, ప్రశాంత్‌నగర్, కురవంక, గొల్లపల్లి, నిమ్మనపల్లె క్రాస్, సొసైటీకాలనీ ప్రాంతాల్లోని వినాయకుని విగ్రహాలను ప్రత్యేకంగా టాక్టర్‌పై ఉంచి అలంకరణ చేశారు. భక్తులు స్వామిని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో యువకులు కేరింతలు కొట్టారు. జై భోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ నినాదాలు చేశారు. రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. డీజెలతో పాటు బళ్లారి డ్రమ్ములు, కేరళ వాయిద్యాలు,కీలు బొమ్మలు నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. టపాకాయలు పేల్చుతూ పూల చల్లుతూ ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలో ఊరేగింపు నిర్వహించి పట్టణ సమీపంలోని తట్టివారిపల్లెలో ప్రత్యేకంగా తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేశారు. రెవిన్యూ,పోలీసుశాఖలు ప్రత్యేకంగా నిమజ్జన ఏర్పాట్లును పర్యవేక్షించారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: స్థానిక సీఎం మహల్ వీధిలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాన్ని సోమవారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అలంకరించిన పల్లకీలో గణేషుని విగ్రహాలను ఏర్పాటు చేసి పట్టణంలోని పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున యువత కేరింతలు కొడుతూ ఉల్లాసంగా నృత్యాలను చేశారు. సాయంత్రం దాకా పురవీధుల్లో ఊరేగించి పట్టణ శివారు ప్రాంతంలోని చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే బజారువీధి, తోటవీధి, కొత్త ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కొత్తపేటవీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద భజరంగ్ దల్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వినాయక విగ్రహ కమిటీ సభ్యులు, యువత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జన వేడుకలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వినాయకుడి నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. బళ్ళారి డ్రమ్ముల శబ్దాలు, కోలాటలు, చెక్క భజనల నడుమ గ్రామ పుర వీధుల్లో వినాయకుడి ప్రతిమలను ఊరేగించారు. పలు చోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినాయకుడి ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేశారు.

వైభవంగా బొజ్జ గణపయ్య నిమజ్జనం

రామసముద్రం: మండల పరిధిలోని బజారువీధి , తిరుమల రెడ్డి , గుంతలపేట, మట్లవారిపల్లి, మినికి, నరసాపురం, ఊలపాడు, దిన్నిపల్లి, మానేవారిపల్లి, పెద్దకురప్పల్లె గ్రామాల్లో సోమవారం వైభవంగా బొజ్జగణపయ్య నిమజ్జనాలు నిర్వహించారు. యువకులు ఎంతో ఉత్సహంతో రంగులు చల్లుకుంటు వినాయకున్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అలాగే భక్తులకు దాతలు అన్నదానం చేశారు. మహాగణపతి స్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లి , గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం

నిమ్మనపల్లె: మండల పరిధిలో పలు గ్రామాల్లో వినాయకప్రతిమల నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా జరిగాయి. శనివారం ఏర్పాటు చేసిన వినాయప్రతిమలకు మూడు రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం మూడవ రోజున వినాయక నిమజ్జన ఊరేగింపు ఉత్సాహంతో యువతీ, యువకులు, మహిళలు పెద్దలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సోమవారం ఉదయం వెంకోజిగారిపల్లె, నిమ్మనపల్లెతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో వినాయకుని నిమజ్జన కార్యక్రమాలు మొదలై సాయంత్రం వరకు కొనసాగాయి.

కేవీపల్లెలో..

కేవీపల్లె : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గణేష్ విగ్రహాన్ని ట్రాక్టర్లపై అలంకరించి బళ్లారి డ్రమ్స్, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు చేపట్టారు. యువత రంగులు చల్లుకుని డ్యాన్స్ చేస్తూ సంబరాల్లో మునిగిపోయారు. గ్రామాల్లోని సమీప చెరువుల్లో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

కలకడలో..

కలకడ : వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా సోమవారం మూడవరోజు అనేక గ్రామాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. చాందినీబండిపై గ్రామ పురవీధులలో విగ్రహాలను ఊరేగించారు. అన్నదాన కార్యక్రమ అనంతరం ఆయా గ్రామాల పరిధిలోని నీటకుంటలలో నిమజ్జనం చేశారు. అధికంగా కలకడ ఝరికోన నీటిజలపాతంలో నిమజ్జనం చేశారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని పాత కాలేజీ మైదానంలో గణేష్ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి మూడవ రోజు భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింపజేశారు.

సోమవారం రిటైర్డు టీచర్ అరుణకుమారి, ప్రభాకర్ దంపతులు అన్నదానం చేశారు. సిద్దారెడ్డిగారిపల్లె, దాదంవడ్డిపల్లె,బేల్దారి కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చిన్నేరు ప్రాజెక్టులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.


పీలేరు :పంచాయతీ కార్యాలయం మిట్టన విగ్రహాలకు హారతి


పీలేరు పట్టణంలో కోలాహలంగా గణేష్ విగ్రహాల ఊరేగింపు


పీలేరు : ప్రత్యేక ఆకర్షణగా కేరళ వాయిధ్యాలు


పీలేరులో నిమజ్జనానికి నీటిలో దించుతున్న భారీ గణేష విగ్రహం


పీలేరు : గణేష్ నిమజ్జనం


రామసముద్రం: తిరుమలరెడ్డిపల్లెలో నిమజ్జనానికి తీసుకెళుతున్న దృశ్యం


వాల్మీకిపురం: బజారువీధిలోని మట్టి గణపతి


వాల్మీకిపురం: నిమజ్జనానికి ఊరేగుతున్న వినాయకుడు


పెద్దతిప్పసముద్రంలో వినాయకుడి ఊరేగింపు దృశ్యం





మదనపల్లె: ఊరేగింపుగా వెళుతున్న ఎస్‌బిఐ కాలనీ వినాయకుడు, నిమ్మనపల్లె వినాయక నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న యువకులు, కేవీపల్లె : గుర్రెడ్డిగారిపల్లెలో వినాయకుడి ఊరేగింపు, తంబళ్లపల్లె: భక్తులకు అన్నదానం చేస్తున్న గణేష్‌యూత్ సభ్యులు